క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేయించాలి

పగిడ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌ను ప్రతి కుటుంబానికి డౌన్‌లోడ్ చేయించాలని ఎంపీడీఓ వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు పూర్తవుతాయన్నారు. అందువల్ల ప్రతి కుటుంబంలో ఆరోగ్య యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలన్నారు. ఆరోగ్య యాప్‌లో ఆ కుటుంబం యొక్క పూర్తి వివరాలు, ఆరోగ్య శ్రీ ఉండే కార్పొరేట్ ఆసుపత్రుల వివరాలు డిస్‌ప్లే అవుతాయన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, వీరన్నయాదవ్, జావేద్, కోట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: నల్లమల అటవీపరిధిలోని కొలనుభారతి క్షేత్రానికి దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు,సీఐ బీకే నాయక్ చెప్పారు. శనివారం వారు మాట్లాడుతూ నేటి నుంచి దసరా ఉత్సవాలు ముగిసే వరకూ ఆత్మకూరు నుంచి కొలనుభారతికి ప్రత్యేకబస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఉదయం, సాయంత్రం ఈ సర్వీసులు నడుస్తాయని, ప్రయాణికుల రద్దీని బట్టి అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

ఆత్మకూరు: అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం తలపెట్టిన ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, రాజశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో శనివారం ఆ పార్టీ డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పార్టీలు కొత్త అజెండాతో ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 31న ఆత్మకూరు పట్టణానికి బస్సు యాత్ర చేరుకుంటుందని, ఆతరువాత వివిధ మండలాల్లో యాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి నరసింహానాయక్, నాయకులు వెంకటేశ్వరరావు, స్వామన్న, శంకర్‌రెడ్డి, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.30 వేలు విరాళం



ద్వార మందిరానికి పూజ చేస్తున్న ఎస్‌ఐ, భక్తులు

నందికొట్కూరు: పాములపాడు మండల పరిధిలోని జూటూరు గ్రామంలో వెలిసిన జమ్మలమ్మగుడి నిర్మాణానికి ఎస్‌ఐ అశోక్ రూ. 30 వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. శనివారం జూటూరు గ్రామంలో జమ్మలమ్మగుడి ద్వారా మందిరముకు గ్రామ సర్పంచు సావిత్రమ్మ, ఎస్‌ఐ, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. అందరి సహకారంతోనే ఆలయ నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో దాతలు మురళి, భాస్కర్‌గౌడ్, మద్దిలేటి, శ్రీను, మనోహర్, బాలాజీ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల సింహగర్జన విజయవంతం చేయండి

నందికొట్కూరు: ఈ నెల 29న తలపెట్టిన దూదేకుల సింహగర్జన కార్యక్రమం విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షులు మౌలా హుసేన్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో దూదేకుల సింహగర్జన పోస్టర్లను ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. దూదేకుల కులానికి చట్టసభలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. దూదేకుల కులాన్ని గుర్తించిన పార్టీకే సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అలీబాషా, హుసేన్, సిద్దయ్య, మౌలా, పక్కీరయ్య, ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం డ్వామా ఏపీడీ అన్వరాబేగం అధ్యక్షతన 17వ విడుత సామాజిక తనిఖీ బహిరంగ చర్చా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ప్రెసిడింగ్ ఆఫీసర్‌గా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. భాస్కరనాయుడు హాజరయ్యారు. సామాజిక తనిఖీ డీఆర్‌పీలు సేకరించిన వివరాలను గ్రామ సభలో వెల్లడించారు. సంకిరేణిపల్లె, పాత, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్, తదితర గ్రామ పంచాయతీలలో బోగస్ హాజరు వేసి మేట్‌లు అవినీతికి పాల్పడ్డారని, అట్టి సొమ్ము రూ. 11,778లు నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. ప్రెసిడింగ్ అధికారి మేట్‌ల నుంచి ఆ సొమ్ము రికవరీ చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ బాలాజీ నాయక్, క్వాలిటీ కంట్రోల్ జూనియర్ అధికారి గంగాద్రి, ఎస్‌ఆర్‌పీ నీలకంఠం, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఓంకారంలో దుర్గాదేవిగా ఉమాదేవి అమ్మవారు



దుర్గాదేవి అలంకరణలో కొలనుభారతిదేవి



నందికొట్కూరులో గోదాదేవి అలంకారం



మిడుతూరులో లలితాదేవిగా..



జూపాడుబంగ్లాలో దుర్గాదేవి అలంకరణ



వేల్పనూరులో కాళరాత్రి దేవి అలంకరణ



ఆత్మకూరులో వేంకటేశ్వరస్వామి అలంకరణ

ఆదిపరాశక్తీ.. పాహిమాం

- వైభవంగా నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం
- ఆలయాల్లో పూజలు

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానంది, ఓంకారం పుణ్యక్షేత్రాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. మహానందిలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, నాలుగు కాలార్చన పూజలు, రుద్ర, చండీహోమాలు వైభవంగా చేపట్టారు. వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, రుత్వికుల ఆధ్వర్యంలో యాగశాలలో శాస్త్రోక్తంగా విశేష ద్రవ్యాలతో పూజలు జరిగాయి. శ్రీశైలం ఆలయ ట్రస్ట్‌బోర్డు మెంబర్ రాజేశ్వరీ సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొన్నారు. శ్రీ కామేశ్వరీదేవి శ్రీ కాళరాత్రి దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది భక్తజనుల మధ్య తిరుచ్చివాహనంపై కొలువైన శ్రీ కాళరాత్రి దుర్గ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీ గంగా, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వర స్వామి వార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉమాదేవి అమ్మవారిని దుర్గాదేవి అలంకారంలో కొలువు చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బుక్కాపురం, బొల్లవరం గ్రామాల్లోని మల్లమ్మ సమేత గంగాదేవి, శివాలయాల వద్ద కొలువైన దుర్గా మాతకు భక్తులు పూజలు చేపట్టారు. బుక్కాపురంలో హైదరాబాద్ కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తిమ్మాపురంలోని శ్రీ అంకాళ పరమేశ్వరీదేవి అమ్మవారికి విశేష ద్రవ్యాభిషేక పూజలు చేశారు.

దుర్గాదేవి అలంకారంలో కొలనుభారతిదేవి

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర ప్రాచీన పుణ్యక్షేత్రమైన కొలనుభారతిదేవి ఆలయంలో ఏడవరోజు ఆశ్వయుజ శుద్ధ సప్తమి (దుర్గాష్టమి)రోజు శనివా రం సర్వస్వతి దేవి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 16 మంది చి న్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

నందికొట్కూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భక్తులందరికీ శ్రీ గోదాదేవి అలంకారంలో శనివారం అమ్మవారు దర్శనమిచ్చారు.



మహానందిలో శ్రీ కాళరాత్రి దుర్గగా శ్రీ కామేశ్వరీదేవి

మిడుతూరు: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం, చౌడేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవార్లు శనివారం లలి తా దేవీ అలంకరణలో రు భక్తులకు దర్శనమిచ్చారు. విశేషపూజలను వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జూపాడుబంగ్లా: ప్రకృతి స్వరూపంగా భావించే స్త్రీ స్వరూపాల్లో తొలిమూర్తిగా దుర్గాదేవిని కొలుస్తారని అర్చకులు లక్ష్మీనృసింహశర్మ, మురళిమోహన్ తెలిపారు. జూపాడుబంగ్లా క్వార్టర్స్‌కాలనీలో వెలసిన శ్రీసరస్వతీదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తాటిపాడు గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో వెలసిన అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు.

శ్రీగజలక్ష్మీదేవిగా వాసవీమాత

శ్రీశైలంప్రాజెక్ట్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం వాసవిమాత శ్రీగజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటలకు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు అన్నపూర్ణ దేవీ అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. వేల్పనూరు గ్రామంలోని అంకాల పరమేశ్వరి ఆలయంలో కాళరాత్రి దేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆత్మకూరు: పట్టణంలో వెలసిన కన్యకాపరమేశ్వరి మాత శనివారం శ్రీవెంకటేశ్వరస్వామి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారు శ్రీపార్వతిదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీఅంబాభవాని, వేంకటేశ్వర స్వామి, సాయిబాబా, అన్ని శివాలయాలతో పాటూ సుంకులమ్మ, జంబులపరమేశ్వర దేవాలయాల్లో అమ్మవారు వివిధరూపాల్లో దర్శనమిచ్చారు.

లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోండి



కక్షిదారులను విచారిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: లోక్ అదాలత్ ద్వారా సులభంగా కేసులను పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు సముదాయంలో జరిగిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అనంతరం నీటిముంపు భూముల పరిహారం కేసులను విచారించారు. ఈ కేసుల్లో రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏజీపీ సుధాకరరెడ్డి, న్యాయవాదులు బలరాం నాయక్, వెంకటేశ్వర్లు, గిరిరాజు, తెలుగు గంగ, శివభాష్యం సాగర్ భూసేకరణ ప్రత్యేక అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండలంలోని ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఏపీఓ అలివేలు మంగమ్మ తెలిపారు. శనివారం మండలంలోని ఉపాధి హామీ సిబ్బందితో పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లారీ ఓనర్లకు పూర్తిగా సహకరిస్తాం

ఆత్మకూరు: పట్టణంలో అత్యధికంగా లారీ ఓనర్లు ఉన్నారని, వారందరికీ తన వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్‌డబ్ల్యూ ఫంక్షన్‌హాల్ సమీపంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో ఓ పరిశ్రమలా లారీ యజమానులు ఉన్నారని, వీరు లారీల ద్వారా ఉపాధి పొందుతున్నారని, అలాగే డ్రైవర్లు , క్లీనర్లు వందల సంఖ్యలో ఇక్కడ జీవిస్తున్నారని చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం లారీ ఓనర్స్ అసోసియేషన్‌సభ్యులు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, వార్డు కౌన్సిలర్ గౌసలాజంను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 6వ వార్డు ఇన్‌చార్జ్ అహ్మద్ రసూల్, లారీ యజమానులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని వెంకటాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మోగి సందీప్ గృహంలో జరుగుతున్న సత్యనారాయణ వ్రతం కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా హాజరయ్యారు.

బాధితులకు ఎమ్మెల్యే శిల్పా చేయూత

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వకు చెందిన యేసురాజు ఇటీవల ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని మృతి చెందిన యేసురాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20వేల నగదు సహాయం అందించారు. అలాగే మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన శివ అనిల్‌కుమార్ కిడ్నీ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయనకు రూ. 20 వేలు నగదు అందించారు. చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ ఇసాక్‌బాషా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎంపీపీ దేశెట్టి చిన్న సంజీవరెడ్డి, నాయకుడు పల్లెసోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



అనిల్‌కుమార్‌కు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరురూరల్: సమాజంలో జరుగుతున్న సరికొత్త మోసాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎస్‌ఐ క్రిష్ణమూర్తి హెచ్చరించారు. శనివారం రాత్రి ఆయన మండలంలోని నల్లకాల్వలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో మోసగాళ్లు కొత్తరూపాల్లో వస్తున్నారని, ఏటీఎంలలో డబ్బులు తీసుకునేటపుడు అపరిచితులతో లావాదేవిలు చేయిచవద్దని, సెల్ ఫోన్‌లలో వచ్చే మెస్సేజ్‌లపై స్పందించ కూడదని హెచ్చరించారు. అలాగే తక్కువ ధరకు బంగారమిస్తామని, అదృష్టం తెచ్చే రైస్ పుల్లింగ్ చెంబులను ఇస్తామని చెప్పే వారిపట్ల అప్రత్తంగా ఉండాలన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

మిడుతూరు: మండలపరిధిలోని కడుమూరు గ్రామానికి చెందిన తిప్పన్న గారి శివ అనే వ్యక్తి రైలు ప్రమాదంలో 18న మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి ఎంపీడీఓ జీఎస్‌ఎస్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ జీవరత్నం చేతుల మీదుగా భార్య శారదకు తక్షణం సాయం కింద రూ. 10 వేలు అందజేశారు. మిగిలిన బీమా రూ.4.90 లక్షలు బీమా పరిహారం క్లైమ్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్ సింగ్ తెలిపారు.

పాతాళగంగ పరిశీలన



పాతాళగంగ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ, ఇంజనీరింగ్ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా శనివారం దేవస్థానం ఈఓ డి పెద్దిరాజు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పాతాళగంగను పరిశీలించారు. మెట్ల మార్గంలో నడిచివెళ్లి ఆయా ఏర్పాట్లపై పలు ఆదేశాలు చేశారు. మెట్ల మార్గంలో ఆర్‌ఓ ప్లాంట్ , భక్తులు సేద తీరేందుకు ఏర్పాట్లు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పాతాళగంగ వద్ద విధులు నిర్వహిస్తున్న ఈత నిపుణులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. తకుముందు గో సంరక్షణశాల వద్ద నిర్మిస్తున్న శ్రీగోకులాన్ని సందర్శించారు. అదే విధంగా యాంపీథియోటర్ కూడా పరిశీలించారు.

వ్యక్తి ఆత్మహత్య

మహానంది: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తిమ్మాపురంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డెవేముల లక్ష్మీనారాయణ(37) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. విద్యుత్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న లక్ష్మీనారాయణ పొలం సాగు చేస్తున్నాడని, అప్పులు అధికం కావడంతో ఉరేసుకుని మృతి చెందినట్లు తల్లి నాగేంద్రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి ఇద్దరు సంతానం. తల్లి నాగేంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కళాకారులకు టీషర్టుల పంపిణీ

మహానంది: మహానందిలోని శ్రీ మహానందీశ్వర స్వామి డ్రమ్స్ కళాకారులకు మహానంది ఆలయ అర్చకుడు మూలస్థానం సుబ్బయ్యశర్మ, ఉమాదేవి దంపతులు శనివారం రాత్రి టీ షర్టులు పంపిణీ చేశారు. దసరా నవరాత్రి సందర్భంగా నిరుద్యోగులైన కళాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించామని వారు చెప్పారు.

గిరిజనుల సంక్షేమానికి సీఎం కృషి

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యానాయక్

శ్రీశైలం: గిరిజనుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యానాయక్ అన్నారు. శ్రీశైల క్షేత్ర పరిధిలోని మేకలబండ చెంచుగూడెంను ఆయన మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్, రాష్ట్ర గిరిజన నాయకులతో కలిసి స్థానిక మేకలబండ చెంచుగూడానికి చేరుకుని చెంచులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మేకలబండ చెంచుగూడెంలో వీధి లైట్లు , డ్రైనేజ్ వ్యవస్థ, మరుగుదొడ్ల నిర్మాణం, తదితర సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దాదాపు 35 ఏళ్ల క్రితం ప్రభుత్వం నిర్మించిన ఇళ్ల పైకప్పు పగుళ్లు ఇచ్చి కూలిపోయే ప్రమాదం ఉందని విన్నవించారు. ఈ సందర్భంగా వడిత్యానాయక్ మాట్లాడుతూ గిరిజన గూడెంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత అధికారులు, ఆయా శాఖలకు కమిషన్ ద్వారా విన్నవించి పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. గిరిజన గూడెంలో నివసిస్తున్న వారు 200 యూనిట్ల వినియోగం వరకు విద్యుత్ బిల్లును చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ కులధ్రువీకరణ పత్రాలు విద్యుత్ శాఖ అధికారులకు అందజేయాలని సూచించారు. సారా తయారీకి దూరంగా ఉండి స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలన్నారు. శ్రీశైల దేవస్థానంలో స్థానిక గిరిజనలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఫించన్లు, రేషన్, విద్య, వైద్య సదుపాయాలతో పాటు జగనన్న నవరత్న పథకాలు గూడెం వాసులకు అందుతున్నాయా...లేదా..అనే విషయాన్ని ఆరా తీశారు. స్థానిక చెంచుగూడెంలో చదువుకున్న వారు కూడ ఉన్నారని వారిలో ఒకరికి మేకల బండ చెంచుగూడెం తరపున సచివాలయ వలంటీర్‌గా నియమిస్తే తమ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని చెంచులు కమీషన్ సభ్యులకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన ఉన్నత స్థాయి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



చెంచుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యానాయక్

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



నందికొట్కూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరు: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు యాదవ్ అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పోలీస్‌గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పోలీసులు పోలీస్ స్టేషన్ నుంచి గౌడ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. గౌడ్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సీఐ నాగభూషణం యాదవ్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

నందికొట్కూరు: పోలీసుల అమరవీరుల త్యాగాల ను స్మరించుకుంచుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని సీఐలు ప్రకాష్‌కుమార్, విజయభాస్కర్ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో పోలీసు అమరవీరులకు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు నివాళులర్పించారు. ప్రధాన రహదారిపై పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎన్వీ రమణ, పోలీసులు, సీపీఐ నాయకులు రఘురామూర్తి, రమేష్, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఎస్‌ఐ మారుతిశంకర్, పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించి అమరులైన పోలీసులకు నివాళ్లలర్పించారు.


శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. టూ టౌన్ ఎస్‌ఐ గంగయ్య యాదవ్ , ఏఎస్‌ఐ రాముడునాయక్, హెడ్‌కానిస్టేబుల్స్ పార్థసారథి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ మీదుగా, రింగ్‌పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

నందికొట్కూరు: విద్యార్థి దశలోని జ్ఞాపకాలు మరవలేనివని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత అన్నారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అల్యూమీని ఉత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం జరిగింది. కళాశాలలో సరస్వతీదేవికి పూర్వపు విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. కళాశాల స్థలదాత జవ్వాజి సుంకన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. పలువురు విద్యార్థి దశ జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. అలాగే పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, రబ్బానీ వేర్‌హౌస్ అధినేత తాటిపాడు మహబూబ్‌బాషా, కర్నూలు, నంద్యాల శాప్ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్, శ్రీనాథ్, మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, శ్రీధర్, శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



శంఖాన్ని పూరిస్తున్న సాధువు



గుర్రంతో విన్యాసం



కోలాటమాడుతున్న మహిళలు



స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం

నేత్రానందం.. అమ్మవారి ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సాయంత్రం గజ వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ఉత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో కోలాటం, డోలు విన్యాసాలు, కేరళ చండీమేళం, డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్యప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



నృత్యం చేస్తున్న కళాకారిణి

గ్రామాల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం

మహానంది: గ్రామస్థాయిలోనే పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారని జెడ్పీటీసీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ కేవీఆర్ మహేశ్వరరెడ్డి అన్నారు. తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అబ్బీపురం సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. క్యాంపులో వైద్యులు 592 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో అబ్బీపురం సర్పంచ్ శవ్వా శ్రీలక్ష్మీ, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శవ్వా శరభారెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, డీటీ సత్యశ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిదని డాక్టర్ మద్దిలేటి అన్నారు. శనివారం మండలపరిధిలోని తిమ్మాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మహమ్మద్ హుస్సేన్, డాక్టర్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

తమిదెల సోదరులకు మాతృ వియోగం

మిడుతూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తమిదెల సర్వేశ్వరరెడ్డి, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసి రెడ్డిల మాతృమూర్తి భారత లక్ష్మీ దేవమ్మ (70) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆమె మరణవార్త తెలుసుకున్న ఏపీ శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి తదితరులు గ్రామానికి చేరుకొని ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. ఏపీ శాప్ చైర్మన్ అంతిమయాత్రలో పాల్గొని , కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు.



అంతిమయాత్రలో పాల్గొన్న ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి